# ఆరాధన

## అరుణ

ఈ వూరి పేరు సత్యపురం.

ఈ వూళ్ళో ముగ్గురు వ్యక్తు లున్నారు. ముగ్గురూ మూడువిభిన్న మతాలకీ, సంస్కృతులకీ చెందినవారు. వాళ్ళు ఎక్కడెక్కడి నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారో నాకు తెలియదు. అయినా వారికి ఇదే స్వంతవూరు.

ఒకరు రాబర్ట్స్ — క్రైస్తవుడు. వయస్సు సుమారు నలభై దాకా వుండచ్చు. అతను డాక్టరు. సత్యపురంలోనే ఆయనకు డిస్పెన్సరీ వున్నది. రోజూ ఉదయం ఆరు గంటలకే తన పాత సైకిలు వెనక కేరియర్ మీద మందుల సంచీ పెట్టుకుని, మెడలో స్టైతస్కోపు వేసుకుని ఎదురుగాలిని చీల్చుకుంటూ చుట్టుప్రక్కల వూళ్ళకి రోగులను చూడటానికి పోతాడు. సరిగా ఆ సమయంలోనే ఆయనకు ఎదురుగా సూర్యోదయమౌతుంది. ఆ అరుణిమతో ఆయన శరీరము, జీవితము నిండిపోతయి. ఆ సమయంలో ఆయన ముఖంలో ఏవో భావాలు ముడులు వేసుకుంటయి.

ఇన్నాళ్లూ ఈ పల్లెటూరి అనాగరిక ప్రజలు ఏ జబ్బు వచ్చినా వేపచెక్క కషాయమో, మిరియాల కషాయమో త్రాగి పడుకునేవారు. ఈ డాక్టరు వచ్చాక పరిస్థితి మారింది. 'ఏం దేవయ్యా, ఎలా వుంది అమ్మాయికి? తగ్గిపోయిందిగదా. ఈ పూట కూడ మందు తీసుకుని వెళ్లు,' అంటూ ఆప్యాయంగా పలకరించి, మందులిచ్చే డాక్టరుమీద వారికి అభిమానము ఎక్కువైంది. రాత్రి గాని, పగలు గాని ఏ నిముషానైనా ఎవరైనా వచ్చి 'బాబు, ఇదీ పరిస్థితి' అంటే చాలు పరుగెత్తి వెళ్లేవాడు. జబ్బుతో బాధపడేవారిమీదనే అతని ఆత్మలో గింగురుమనేది. ఎవరైనా దయ తలచి 'ఇదిగో బాబు మీ ఫీజు' అంటే తీసుకునేవాడు, లేకపోతే లేదు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తూ వుండేవాళ్ళని చూస్తే ఈయనకు అపేక్ష. అలా ఏమీ లేనివాళ్ళయితే పైసకూడ పుచ్చుకోడు. ఇతరులకోసరం జీవించటం అతని జీవిత పరమార్థం.

డాక్టరుది ఒకపూటే భోజనం. అదికూడ వూళ్ళన్నీ తిరిగివచ్చాక వండుకుని తినటం. ఈయనకి తోడుగా చిన్న పనులు చేసి పెట్టేందుకు ఒకే ఒక చిన్న కుర్రవాడున్నాడు, అంతే. పెళ్ళయిందో లేదో ఎవరికీ తెలియదు. చాలామంది కాలేదంటారు. కాని రోజూ ఉదయమే లేస్తూనే గదిలోని సూట్ కేసులోంచి ఓ అందమైన అమ్మాయి ఫొటో తీసి "గుడ్ మార్నింగ్ డియర్. ఎలా వున్నావు?" అంటాడు.

అంతలోనే ఆయనముఖం వివర్ణమయ్యేది. దీనంగా ఆ ఫొటోని చూస్తూ "నేను దురదృష్టవంతుడ్ని సుశీ. డాక్టర్లమై ప్రజాసేవ చేయాలనుకున్నాం. అనుకోకుండా కలిశాం. ఆశలు నింపుకున్నాము. అలాగే విడిపోయాము. కాని నీ సంస్కారం యొక్క ప్రభావం నన్ను వెంటాడుతునే వుంది; నా హృదయంచుట్టూ కాంతివలయంలా తిరుగుతున్నది. 'ప్రతిఫలాన్నాశించకుండా నీ పని నువ్వు చెయ్యి?'— అబ్బ! ఎంత గొప్పగా చెప్పావు ఆ రోజు. ఈ ఆశయంతోనే నేను మిగిలిపోయాను. జబ్బు తగ్గాక ఈ రోగుల ముఖంలో ఆనందరేఖల్ని చూస్తూంటే ఎంత తృప్తిగా వుంటుందో తెలుసా సుశీ? వారిలో నా ఆత్మే కనిపిస్తుంది. క్షణంలో ఆప్తులైపోతారు. నాకు నువ్వే గుర్తువస్తావు డియర్. నీకు నేను అలాగే గుర్తువస్తానా? వద్దు. అది నీకు మంచిది కాదు. ఇప్పుడు నీవు గృహిణివి. నీ కర్తవ్యం ఎక్కువ. ఆరోగ్యమైన జీవితాన్ని జీవించు డియర్." అంటాడు. ఆయన ఎవరితోనూ చెప్పుకోలేని ఒకే ఒక రహస్యం ఇది. ఇప్పుడు ఆయన సర్వసంగ పరిత్యాగి.

సరిగా ఈ డిస్పెన్సరికి వెనుకవున్న వీధిలో ఒక ముస్లిం వున్నాడు. అతని పేరు సత్తార్. ఆ వీధిలోనే అతనికి ఒక చిల్లర దుకాణం వున్నది. అతన్ని గురించి చెప్పాలంటే ఏమీ లేదు. నిజమైన ముస్లిం అతను. రోజూ శ్రద్ధగా ప్రార్థన చేస్తాడు. కురాన్ శ్రద్ధగా పఠిస్తాడు. కల్లు త్రాగడు. మాంసము తినడు. ఎవరికైనా అప్పు ఇస్తే కనీసం వడ్డీకూడ తీసుకోడు. అతని దుకాణానికి అన్ని రకాల వ్యక్తులు వస్తుంటారు. "రండి బాబు రండి. అల్లా మిమ్మల్ని కరుణిస్తాడు. ఏం కావాలి మీకు?" అంటూ ఆదరంగా అడుగుతాడు. వారేదైనా అడుగుతే ఆ వస్తువు ఇచ్చి దాని అసలుధర దానిమీద తను వేసుకున్న కొద్ది లాభము చెప్పేవాడు. మిగిలిన దుకాణాలలో కన్న ఇక్కడ వస్తువులు చౌక. అదిగాక సత్తార్ నీతీ, నిజాయితీ జగద్విదితము. అందుచేత చాలమంది వస్తువులు కొనటానికి ఇక్కడికే వస్తుంటారు.

ఇక రంజాన్ మాసం వచ్చిందంటే సత్తార్ పగలు పచ్చిమంచినీళ్ళుకూడ ముట్టడు. సాధ్యమైనంత ఎక్కువకాలం దైవధ్యానంతో గడుపుతాడు.

అతనికి ఒకే ఒక కొడుకున్నాడు. తండ్రి నోట్లోంచి ఊడిపడ్డాడు. ఎక్కడో పట్నంలో చదువుతున్నాడు. సత్తార్ కది అంత ఎక్కువ ఇష్టం లేదు. కొడుకు తనదగ్గరే వుండాలని అతని ఆశ. హాయిగా వాడికి ఓ ఇంటివాడ్ని చేసి ఈ దుకాణం అప్పగించి తను ఆధ్యాత్మిక చింతనతో కులం గడపాలని అతని కోరిక. కాని కొడుకు వినందే. 'ఈ కాస్తకూడ కాని నాన్నా' అన్నాడు. అంటూనే వెళ్లాడు. సరిగా మూడేళ్ళయిందేమో వాడొచ్చి. అప్పుడయినా రెండు మూడు రోజులకంటే వుండలేదు. అయితే పదిరోజులకి, ఇరవై రోజులకీ తండ్రికి ఉత్తరం వ్రాస్తాడు. అప్పుడప్పుడు సత్తారే వెళ్ళి చూసివస్తుంటాడు.

ఇక మూడోవ్యక్తి రామదాసు-వృద్ధుడు. ఆయన చేసేపని ఏమీలేదు. ఊరి మధ్యగా చిన్న పూరింట్లో వుంటున్నాడు. ఆయనకి ఎవరూ లేరు ఇప్పుడు. ప్రస్తుతం ఆయన పరిస్థితికూడ విచారకరంగావుంది. కళ్ళు సరిగా కనపడవు. ఒంట్లో సత్తువకూడా హరించిపోయింది; అసలు ఒంటరితనంతో బాధపడుతున్నాడు.

ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థిరపడ్డాడు. అంతకు మునుపు ఎక్కడున్నాడో ఏం చేసేవాడో ఎవరికీ తెలియదు. ఒక్క సత్తార్ తోనూ, రాబర్ట్సుతోనూ తప్ప ఇంకెవరితోనూ తన చరిత్ర చెప్పుకోలేదు, వారి దగ్గరనుంచి ఆశించిన అనుభూతి లభించినా, శాంతి లేదు. కాని మండుతున్న గుండెని ఎన్ని కన్నీళ్ళు చల్లార్చగలవు. ఆ పాపమే తనను పామై కాటువేసింది. తనకు ఆలోచించే శక్తే లేకపోతే ఎంత బాగుండు? కాదు నిన్నా మొన్నా జరిగినట్లుందే సత్యం.

* * *

"నీ ఉద్యోగం పోయింది." అన్న మాట విని స్థాణువై నిలబడిపోయాడు రామదాసు.

"వెరీ సారీ, పని తక్కువ - పనివాళ్ళెక్కువ. వర్కర్లని తగ్గించమని ఆర్డర్లు వచ్చాయి. ఏం చేయను?" అన్నాడు మేనేజరు.

రామదాసు కంపిస్తున్న గొంతుతో 'సార్' అన్నాడు.

ఆఫీసరింక మాట్లాడలేదు. ఆయనంతే; ఇష్టం లేకపోతే మాట్లాడడు.

రామదాసు చేసేదిలేక బయటకు వచ్చాడు. ఆతనిదగ్గర ఎక్కువ డబ్బుకూడ లేదు. ఈ కాస్త సేపటిలోనే అతని జీవితం బరువెక్కింది. అతని కళ్ళలో పదేళ్ళ కొడుకు భవిష్యత్తే అగమ్యగోచరంగా కనిపించింది. అసలే తల్లిలేనివాడు. వాడు బాధపడితే తను చూడలేడు. తెలిసినవాళ్ళనెందరనో బ్రతిమాలాడు. భంగపడ్డాడు. ప్రయోజనం లేదు. ఎక్కడికి పోయినా విధి వెక్కిరించింది.

ఆఖరికి ఒకచోట చిన్న ఉద్యోగం దొరకింది. సినిమా హాల్లో గేటుకీపర్ పని. దానితోపాటు వాల్ పోస్టర్లు కూడ అంటించి రావాలి. హాలు యజమాని నిరంకుశుడు. ఈ షరతులన్నీ ఒప్పుకుంటేనే పని యిస్తానన్నాడు. రామదాసుకి ఒప్పుకోక తప్పలేదు. ఎన్నాళ్ళని పస్తులుండటం? 'నా జీవితం నాది' అని తృప్తిపడి అభిమానాన్ని చంపుకున్నాడు.

రోజూ తన పని సక్రమంగా చేసేవాడు. కొద్దిరోజులలోనే అతనంటే అందరికీ అభిమానం ఏర్పడింది.

ఒక రోజు - చాలా దురదృష్టకరమైన రోజు - పోస్టర్లు అంటించడానికి వెళ్ళాడు. గోడకి నిచ్చెన వేసి పోస్టరుకి మైదా రాస్తున్నాడు. అతని చూపులు అప్రయత్నంగా ఒక వస్తువుమీద కేంద్రీకరించినయి. వెండి కంచం! సూర్యకాంతిలో మిలమిల మెరుస్తున్నది. ఎవరిదో ఆ ఇల్లు? పెరటితలుపులు వేసివున్నయి. చుట్టుప్రక్కల జనసంచారం లేదు. రామదాసు గుండెలో ఆశానక్షత్రం మినుకు మినుకు మని మెరిసింది. క్రమంగా దాని కాంతి ఎక్కువై హృదయాన్నంతా ఆవరించుకుంది. అతనిలో భావాలు కొట్టుకున్నాయి. ఆ వేడికి అతని ముఖం నిండా స్వేదబిందువులు ఆక్రమించుకున్నాయి. అతని అంతర్వాణి హెచ్చరించసాగింది.



రామదాసు రక్తం మరిగిపోతున్నది. ఆ కొద్ది సేపటిలో ప్రపంచంమీద ఇన్నాళ్ళనుంచీ పేరుకున్న కసి పైకి వచ్చింది. తమ కడుపు నింపుకుని తనని చూసి నవ్విన వ్యక్తులు గుర్తు వచ్చారు. తనకి జరిగిన అన్యాయం కళ్ళముందు నిలిచింది. అతని హృదయం దహించుకుపోయింది. స్వార్థం బుసలు కొట్టింది. తమ బ్రతుకులమీద జాలి ఎక్కువైంది. అసహ్యం వేసింది. తమని చీడపురుగుల్లా చూసే సంఘంమీద ద్వేషం మొదలయింది. ఆవేశం హద్దులు దాటింది.

ఇక ఆగలేకపోయాడు.

'దొంగతనము చేయరాదు' అంతర్వాణి హెచ్చరించింది.

నీతిగా బ్రతికినందుకు లభించే దేమిటి?

'మనిషి నైతిక పతనమే పాపం.'

పాప పుణ్యాలు మనిషి నిర్మించిన పేక మేడలు. సంఘంలో మనిషి అంతస్థును బట్టి పాపపుణ్యాల విలువలు మారుతున్నాయి.

చాలాసేపు జరిగిన యుద్ధంలో స్వార్థం గెలిచింది. అతని జ్ఞానదీపాన్ని ఆర్పేసింది.

గోడమీదికి ఎక్కి లోపలికి దూకాడు చప్పుడు కాకుండా. అతని కాలికి తగిలి నిచ్చెన పడిపోయింది.

ఎవరూ చూడటంలేదని నిర్ధారణ చేసుకుని దాని దగ్గరకు పరిగుత్తికెళ్ళి తటాలున చేతిలోకి తీసుకున్నాడు. వణుకుతూ పైన వేసుకున్న తువ్వాలు తీసి చుట్టుకున్నాడు. పారిపోదామని రెండడుగులు వేశాడో లేదో, ఎవరో అతని చేయి పట్టుకున్నారు. రామదాసు ఉలికిపడ్డాడు. అతని గుండె ఆగిపోయినంత పనయింది. అతని కళ్ళలోకి నిస్సహాయంగా చూశాడు. ఆవేశం చల్లారి, స్వార్థం పారిపోయేసరికి తను చేసిన నీచపు పనికి తనకే అసహ్యం వేసింది. ఏడుపు వచ్చింది. పిరికితనం ఆవహించింది. 'పొరపాటయింది. క్షమించండి బాబు!' అన్నాడు. కాని అతను వినలేదు. 'దొంగ దొంగ' అని అరుస్తున్నాడు.

రామదాసు వివేకం పని చేసింది. జరిగింది సర్ది చెబుదామనుకున్నాడు. కాని అతను వినందే. నలుగురు పోగవుతే మరీ కష్టం. అప్రయత్నంగా అతని నోరు నొక్కాడు. అలా ఎంత సేపో తెలియదు. కాని తన చేతుల్లో గింజుకుని గింజుకుని చివరకు తల వాలిపోవటం మాత్రం చూశాడు.

'హత్య!'

చుట్టూ చేరిన జనం ఒకటే మాట.

'రామదాసు, నువ్వు హంతకుడివి!'

రామదాసు మాట్లాడలేదు. తల వంచుకుని నిలబడ్డాడు. అతని కన్నీటిలో కొడుకు దీన వదనం కరిగిపోతున్నది.

హత్యానేరానికి ఉరిశిక్ష వేస్తారనుకున్నాడు. కాని పధ్నాలుగేళ్ళు కఠిన జైలు శిక్ష అని చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాడు. పధ్నాలుగేళ్ళు - అప్పటికి బ్రతికుంటే- అనుకున్నాడు రోజులు లెక్కబెడుతూ.

జైల్లో ఉండగా కొడుకు శేషు అయిదారుసార్లు వచ్చాడు — ఆ తరువాత రాలేదు. అతన్ని గురించి ఏమీ తెలీలేదు. పోలీసు కానిస్టేబుల్‌ని బ్రతిమాలగా కనుక్కొని ఎవరో పక్కవూళ్ళో అనాధ శరణాలయంలో చేర్చినట్లుమాత్రం తెలిసింది.

జైలుశిక్ష పూర్తయి రాగానే కొడుకు కోసరమే వెదికాడు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. అక్కడక్కడ దొరికిన గాలివార్తలను పోగుచేస్తే మిలిటరీలో చేరినట్లు తెలిసింది. అయినా ఆశ చావలేదు. అది మూల ప్రకృతి. పై మిలిటరీ అధికారులకు ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు. చిన్నప్పటి ఫొటోలు పంపాడు. కాని కాలం కలిసిరాలేదు. శూన్యమైన హృదయంతో తిరిగి తిరిగి ఈ వూరు చేరుకున్నాడు. ఇక్కడే కాస్త విశ్రాంతి లభించింది. దానికి కారణం రాబర్ట్స్, సతార్.

ఇన్నాళ్ళ తరువాత కొడుకులేని కొరత మరీ కనిపిస్తున్నది. పరిపూర్ణతలేని జీవితంలో ఎంత వెలితి? ఈ మధ్యచూపు కనిపించకుండా పోయినప్పటినుంచీ మరీను. ఎవరూ లేని సమయంలో గాఢసమాధిలాంటి నిశ్శబ్దంలో, చీకటివీణను మ్రోగించే గుడిసెలో ఒంటరిగా కుక్కిమంచంమీద పడుకుని అతుకులు వేసి కుట్టుకున్న జీవితాన్ని గురించి ఆలోచించినప్పుడు దేశాలపాలయిన కొడుకే గుర్తు వచ్చి, మనశ్శాంతి లేకుండా చేస్తాడు. క్షణంలో అతని ఆత్మలో ఆత్మ అయిపోతాడు. అజ్ఞాతంగా వున్న కొడుకుమీద ఆపేక్ష పెనవేసుకుపోతుంది. గుండెలో దిగులు గుబులు ముడి వేసుకుంటయి. శోకం లాంటి ఆ భారం కళ్ళల్లో నీరు కాలవలు కట్టి ప్రవహించేదాకా వుంటుంది.

ఇక శేషు రాడా? అసలు కనపడడా?

* * *

ఇవి ఈ ముగ్గురి జీవితాలు. రాబర్ట్స్ తనని తాను ఓదార్చుకున్నాడు. సతార్‌కి ఏమీ లేదు. ఇక రామదాసే ఎక్కువ బాధపడేవ్యక్తి.

ఈ ముగ్గురూ రోజూ సాయంకాలంపూట ఊరిబయట మండపంవద్ద కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. ఆ వూరికి పేపరు రాదు. రాబర్ట్స్ పొరుగు వూళ్ళకి వెళ్ళి వస్తాడు గనుక అతనే విశేషాలు చెబుతాడు.

"విన్నావా సతార్, అంబాలాలో సైనిక ఆసుపత్రిమీద బాంబులు వేశారట."

"హాస్పిటల్ మీదనా?"

"ఇదిగో, పేపర్లో ఫొటో వేశారు."

సతార్ ఆత్రంగా పేపరు చేతిలోకి తీసుకుని చూశాడు. రాబర్ట్స్ మనస్సులో 'వాళ్ళకి ఏమీ తెలియదు. వాళ్ళని క్షమించు' అని ప్రార్థిస్తున్నాడు.

"ఎంత కిరాతకం భాయి," అన్నాడు రామదాసు.

"ప్రేమ సృష్టిస్తుంది. ద్వేషం నాశనం చేస్తుంది."

"మనని ద్వేషించటమెందుకు? మనమేం చేశాము?"

"ఒక మనిషిని ఒకరు దేనికి ద్వేషిస్తారో చెప్పటం కష్టం. అసూయ కావచ్చు, అసంతృప్తి కావచ్చు."

మానవు లందరూ సమానమేనని నమ్మితే ఈ యుద్ధా లుండవు. కాని మతం, వర్ణవ్యవస్థ, సాంఘికస్థాయి. వర్ణవ్యవస్థ, స్వార్థం, రాజకీయాలు, ధనం — ఇవన్నీ మానవులలో చీలికలు తెచ్చాయి. తన కేం కావాలో, ఏ మక్కర్లేదో మనిషికే తెలియదు. తృప్తిపడటం అనలే చేతకాదు. దీని చుట్టూ సిద్ధాంతాలు. భయంకర వైకల్యంతో, హింసతో కూడిన ఈ ఊహా విజయమే ఆ సిద్ధాంతాలకు లక్ష్యం కావటం. సామ్రాజ్య విస్తరణకాంక్ష ఎక్కువైంది. అధికార పిపాస - తాము ఇతరులకంటే గొప్పవాళ్ళ మనుకునే అహం ఇవి మనిషిలో విచక్షణాజ్ఞానాన్ని చంపి, పశుత్వాన్ని ఆపాదించినయి. ఇవన్నీ పోతే రక్తపాతం ఆగిపోయి శాంతికి ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. ప్రతి మనిషీ స్వార్థాన్ని పోగొట్టుకుని జీవితాన్ని సత్యానికీ, సౌందర్యానికీ, నిష్కామ కర్మకీ అంకితం చేసిన రోజున ఇది సాధ్యం," అన్నాడు రాబర్ట్స్.

రామదాసు నిట్టూర్చాడు.

'మానవుడా! భగవంతుడ్ని చేరుకోటానికి కావలిసిన సాధనకి ఉపయోగించవలసిన జీవితకాలాన్ని మరొకమనిషి పతనాన్నాశించటంతో ముగిస్తావెందుకు?' అన్నాడు సతార్.

ఎవరూ మాట్లాడలేదు.

దూరంగా మసీదుపైన రాములవారి దేవాలయశిఖరంపైన దీపాలు వెలిగాయి.

"దీపాలు వెలిగినయి; రండి ప్రార్థన చేద్దాం" అన్నాడు సతార్.

ముగ్గురూ వెంటనే —

'రఘుపతి రాఘవ రాజారాం
పతీతపావన సీతారాం
ఈశ్వర అల్లా తేరే నాం
సబ్‌కో సమ్మతి తే భగవాన్'

అని భజన చేశారు.

చాలాసేపటిదాకా సతార్‌కి రామదాసుకి ఒళ్ళు తెలీలేదు. 'ఈశ్వర అల్లా తేరే నాం' వారి గుండెల్లో మార్మోగుతునే వుంది.

"మీలో నన్ను చేర్చుకోండి," అన్నాడు రాబర్ట్స్ నవ్వుతూ.

"ఎప్పుడో చేరావు భాయీ. అసలు నీకూ మాకూ తేడా ఏముంది? నువ్వూ మానవుడివే. మనం ఒకళ్ళ నొకళ్ళు ప్రేమిద్దాం. గుడికి పోతున్నామంటే గుడిలోనే దేవుడున్నాడనా? మనకు దైవత్వంమీద వుండే నమ్మకాన్ని ఒకచోట కేంద్రీకరించటానికి," అన్నాడు రామదాసు.

"నిజం భాయి," అన్నాడు సతార్.

"ఇక పోదామా? మళ్ళీ డిస్పెన్సరీ తెరవాలి."

రామదాసుచేయిపట్టుకుని సతార్ లేచాడు.

రోజూ ఇంతే. వారి ఈ వేదనకు చిహ్నంగా మండపాన్ని చీకటి ఆవరిస్తుంది. అయినా విశ్వసౌందర్యంలా ఆ మండపం అలాగే నిలిచివుంటుంది. ఆ చీకటిలోనే ప్రకృతి మానవుడు ఒకళ్ళ నొకళ్ళు అన్వేషిస్తున్నట్లే కనపడతారు.

* * *

"సతార్ భాయి, నా కేదో ఉత్తరం వచ్చింది చూడు," అంటూ వచ్చాడు రామదాసు.

"ఏది" అంటూ కవరు చేతిలోకి తీసుకుని చించాడు సత్తార్.

"చదువు భాయి."

"నాన్నా" మొదటి రెండు అక్షరాలు చదివి ఆపాడు సత్తార్. రామదాసు ముఖంలో వేయి దీపాలు వెలిగాయి.

"ఏమిటి సత్తార్?" అంటూ ఆత్రంగా ముందుకు జరిగి కూర్చున్నాడు.


"చాలా రోజుల తరువాత ఇన్నాళ్ళకు నీ కబురు తెలిసింది. ప్రస్తుతం నేనిక్కడ యుద్ధంలో వున్నాను. ఏ క్షణాన ముందుకు ఉరకాలో తెలీదు. నిజానికి ఇప్పుడు మెషన్ గన్ పట్టుకుని సిద్ధంగా వున్నాను. అయితే రెండు గంటల క్రితమే కాల్పులు ఆగిపోయినయి. ఇప్పుడే కాస్త వీలు చిక్కింది. ఇన్నాళ్ళూ, తండ్రివైనా, నిన్ను తెలియకుండా అజ్ఞాతంలో వున్నాను. కనుక నీ కబురు తెలిశాక నా సంగతి తెలపకుండా వుండలేకపోతున్నాను. మళ్ళీమళ్ళీ వ్రాయటం కుదరకపోవచ్చు. అసలు నా కబురే నీకు తెలియకపోవచ్చు. ఇప్పటికి మేము వారి భూభాగాన్ని ఆక్రమించుకున్నాము. శాంతి ప్రియులమైన మమ్మల్ని తుపాకి పట్టేటట్లు చేశారు. అయినా, అంతిమ విజయం మనదే నాన్నా! నాకు ధైర్యం. ఆత్మవిశ్వాసం వున్నాయి. మన దెబ్బకి తట్టుకోలేక పారిపోతుంటే జాలేస్తుంది. యుద్ధాన్ని రాజకీయవేత్తలు కోరుకుంటారు. ప్రజలు దాని ఫలితాన్ని అనుభవిస్తారు." సత్తార్ ఆపి రామదాసు వంక చూశాడు.

"నా ప్రక్కనున్న సోదర సైనికుడు యుద్ధరంగానికి వచ్చేటప్పటికి క్రొత్త పెళ్ళికొడుకు. మరొకతని భార్య అప్పుడే నూతన శిశువుని ప్రసవించింది. ఇలా ఎందరో వీరులు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా పోరాడుతున్నారు. మాకు విజయం కలగాలని ఆశీర్వదించు." సత్తార్ ఉత్తరం పూర్తి చేశాడు.

"సత్తార్!" అన్నాడు రామదాసు గద్గదస్వరంతో.

సత్తార్ ఆప్యాయంగా రామదాసు వీపు మీద చేయి వేసి నిమిరాడు.

"నా కొడుకు భాయి వాడు. వాడికోసరమే నా కలవరింత. నా బాధ చూస్తున్నావుగా. ఇన్నాళ్ళకి వాడి సంగతి తెలిసింది.




అంతే చాలు. నన్ను దేవుడు కరుణించాడు," అన్నాడు రామదాసు ఆనంద బాష్పాలు కారుస్తూ.

సత్తార్ కళ్ళు చెమ్మగిలినయి.

"మంచివాళ్ళని దేవు డెప్పుడూ కరుణిస్తాడు. నువ్వేమీ దిగులుపడకు. నీ కొడుకు క్షేమంగా తిరిగివస్తాడు. ఉండు; నీ నోట్లో ఇంత పంచదార పోస్తాను. మంచి శుభవార్త తెలిసింది," అన్నాడు సత్తార్ లేస్తూ.

"అమృతం త్రాగినట్లుంది భాయి ఈ రోజు," అన్నాడు, సత్తార్ పోసిన పంచదార చప్పరిస్తూ,

ఆతరవాత అప్పుడప్పుడు రామదాసుకి ఉత్తరాలు వచ్చేవి. ప్రతి ఉత్తరంలోను తమ విజయాన్ని గురించే వ్రాస్తూవుండేవాడు. ఆ ఉత్తరాలు తీసుకుని సత్తార్ దగ్గరకి పరుగెత్తేవాడు. అతని ఆనందానికి సత్తార్ కి ఆశ్చర్యం కలిగేది. ఆ ఆనందంలో ఒక తృప్తీ భయమూ రెండూ ఉండేవి.

"నువ్వింత ప్రేమిస్తున్నట్లు నీ కొడుక్కు తెలీదేమో భాయి."

"ఎందుకు తెలీదు? నేను వాడిని ప్రేమించటంలో గొప్ప లేదు. వాడికి నేను గుర్తుండటమే గొప్ప."

"అదృష్టవంతుడివి. త్వరలో నీ కొడుకు తిరిగివస్తాడు."

"ఏమో సత్తార్, నాకెందుకో భయంగా వుంది. యుద్ధంలో వున్నాడు."

"నిన్ను చూసి నువ్వు గర్వపడాలి. నీ కొడుకు ధైర్యంగా దేశాన్ని రక్షిస్తున్నాడు."

అంత భయంలోనూ రామదాసు పులకరించి నవ్వాడు.

"యుద్ధం ఆగిపోతే బాగుండు." ఇద్దరి కళ్ళలో ఒకటే ఆశ.

ఈ ఆశ రామదాసు జీవితంలో అమృతం చల్లింది. అతని భవిష్యత్తులో వెలుగురేఖ అనిపించింది.

*    *    *

2

"యుద్ధం ఆగిపోయింది రామదాసు," అన్నాడు రాబర్ట్స్ పేపరు మడుస్తూ.

"నిజంగానా?" అన్నాడు రామదాసు.

"దేవుడు కరుణించాడు," అన్నాడు సతార్.

"అవును;రష్యావాళ్ళు కల్పించుకున్నారు. 'కాల్పుల విరమణ' జరిగింది."

"అయితే నా తండ్రి వస్తాడు కదా సతార్?" అన్నాడు రామదాసు.

"తప్పకుండా వస్తాడు. మీ వాడుకూడా అదే వ్రాశాడు కదా!"

"ఎన్నాళ్ళో అయింది వాడ్ని చూసి. ఇప్పుడు వస్తే మాత్రం ప్రయోజనం ఏముంది? నేను వాడిని చూడగలనా ఏమన్నా నా? కాని వాడి స్పర్శ నా కింక బాగా గుర్తున్నది. పదేళ్ళవాడిని నిర్దాక్షిణ్యంగా వదిలిపోయిన ఈ తండ్రిని వాడు క్షమిస్తాడా? ఆ రాత్రి వాడు కార్చిన కన్నీళ్ళు నా చేతులలో ఇంకా వున్నాయి. అగ్నికణాల్లా మండుతున్నాయి. చూడు—" రామదాసు కళ్ళల్లో నీరు తిరిగింది. అనుభవాలతో ముడుతలు పడిన ముఖంమీద ఎత్తు పల్లాలలో నీరు ప్రవహించింది.

సతార్ హృదయం కరిగిపోయింది. ఈ అమాయక మిత్రునిమీద ప్రేమ పొంగి పొరలింది.

"ఊరుకో భాయి, ఎందుకలా బాధ పడతావు? అంతా శుభంగా ముగుస్తుంది. నేను హామీ ఇస్తున్నాగా," అన్నాడు.

"వాడు పుట్టినప్పటినుంచీ అన్నీ కష్టాలే – ఏం సుఖపడ్డాడో దేవుడికే తెలుసు. తండ్రిని బ్రతికి వున్నానే గాని ఎందుకూ పనికిరాను. వాడికోసరం ఏడ్చి ఏడ్చి నా కన్నీళ్ళు ఇంకిపోయినయి;" రామదాసు పసిపిల్లాడే అయినాడు.

"ఊరుకో. దేవుడు కరుణించాడు. ఇన్నాళ్ళు ధైర్యంగా వున్నవాడివి, ఇప్పుడెందుకు?" అన్నాడు రాబర్ట్స్.

సతార్ లోలోపల ఈ వృద్ధుడి బాధకి దహించుకుపోతున్నాడు. చాలసేపటికిగాని అతని శోకం చల్లారలేదు. చీకటి అతన్ని జాలిగా ఒడిలోకి తీసుకుంది. ఆవేదనని తన లోకి తీసుకుని మరింత నలుపెక్కింది.

ఆ రాత్రంతా కలలతోనే గడిపాడు రామదాసు.

అతని బాధ, కీచురాయి ప్రపంచానికి వినిపిస్తూ అరుస్తూనే వుంది!

సతార్ ఇంట్లోంచి దీనస్వరంతో 'రఘుపతి రాఘవ రాజారాం-' అని ప్రార్థన గీతం వినిపిస్తూనే వుంది.

* * *

"సతార్ సాబ్, పోస్టు."

"ఉత్తరమా?" అన్నాడు దుకాణం లోంచి లేచి వచ్చి.

"మీకు కాదు. రామదాసుగారికి. ఏలాగైనా ఆయన మీ దగ్గరకు రావలసిందే గదా! అందుకే మీకిచ్చాను. ఆయన ఇంట్లో లేడు.

సతార్ ఉత్తరం తీసుకుని చించి చదివాడు అప్రయత్నంగా.

"రామదాసు గారు,

నేనొక పత్రికావిలేఖరిని. మీకు ఈ విషాద వార్త రాయటానికి నన్ను భగవంతుడు నియోగించినందుకు విచారిస్తున్నాను. నిన్న సాయంకాలం మీ కుమారుడు శేషు సైనిక ఆసుపత్రిలో మరణించాడు. అంతకుముందు నాలుగురోజులుగా అతను కాళ్ళలోను, వీపులోను. చేతులలోను తుపాకిగుండ్లు దిగబడినయి. అంతకు ముందురోజు అతను చేసిన వీరవిహారాన్ని మేమెవరమూ మరిచిపోలేము. 'నీ చేతులు తెగిపోయినయి బ్రదర్' అని నేను బాధగా అంటే, 'మరేం భయంలేదు. నా వెనుక నలభై ఏడు కోట్ల జతల చేతులున్నయి.' అని అన్నాడు. అలాంటి కుమారుడ్ని కన్న మీరు ధన్యులు. మీ పుత్రశోకాన్ని దేశమంతా పంచుకుంటున్నది.

అతను పోయేముందు ఈ విషయం మీకు తెలియజేయమని కోరాడు. అందుకని నాకు తప్పలేదు."

సతార్ చేతులో ఉత్తరం జారిపోయింది.

అతని కళ్ళలో ముత్యాల బిందువులు నిలిచినవి. ఒక్కసారి కాళ్ళక్రింద భూమి కంపించింది.

'శేషు మరణించాడు!'

ఈ వార్త తెలిస్తే రామదాసు గుండె బ్రద్దలయిపోతుంది. ఈ వృద్ధుడిమీద దేవుడికెందుకో అంత కోపం? ఫలం అందినట్లే అంది, శాశ్వతంగా దూరమైంది. ఇక అతనికి ఆనందమెక్కడిది? శాంతి ఎక్కడిది? చమురైపోతున్న దీపం క్షీణించి చివరకు శాశ్వతంగా ఆరిపోతుంది. అలాగే రామదాసు కూడాను.

"రామదాసూ, ఎంతదురదృష్టవంతుడివి?" సతార్ బిగ్గరగానే ఏడ్చాడు. ఆ ఏడ్పు దూరంగా మసీదులో, రాములవారి గర్భగుడిలో, మండపంలో, మార్మోగింది.

"ఇలా ఆశలను త్రెంపితేగాని నీ ఉనికిని గుర్తించమని భయమా?"

దేవుడు పలకలేదు. అతని చిరునవ్వులా ఆకాశంలో విద్యుల్లత మెరిసింది.

"వాడు లేకపోతే నే బ్రతుకలేను భాయి. అసలే గ్రుడ్డివాడ్ని. వాడిదగ్గర పడివుందామనుకున్నాను." సతార్ గుండెలలో రామదాసు ఏడుస్తున్నాడు. భరించలేని ప్రేమతో సతార్ వణికిపోయాడు. అతని గుండెలలో సముద్రమథనం జరుగుతున్నది. అతని మనస్సు ఆత్మీయతతో విలవిల్లాడింది. రామదాసు మీద మమత ద్విగుణీకృతమైంది. జాలీ అభిమానం, ఆపేక్షా చల్లని గాలులై గాఢంగా మబ్బుపట్టిన హృదయాకాశాన్ని తాకినయి. వర్షం కురిసింది. ఆ వర్షంలో రామదాసు తడిసిపోయాడు.

"భగవంతుడా, నీ ఉనికే నిజమైతే రామదాసుని కరుణించు. అతని దుఃఖాన్ని చల్లార్చు."

అతని మాటలు ఏడుస్తున్నయి – కన్నీళ్లు మాట్లాడుతున్నయి.

సతార్ తల పట్టుకు కూర్చున్నాడు. అతని కళ్ళముందు కురాన్ పుటలు రెపరెపలాడాయి.

సతార్‌కి ఎవరో తనని సంస్కరిస్తున్నట్లుగా తోచింది. ఈ పరిశోధనలో అతనికి రామదాసు ఆత్మ కనిపించింది.

సతార్ కళ్లు మూసుకున్నాడు.

"త్యాగం!" మసీదులో ఎవరో గుసగుసలు చెప్పుకుంటున్నారు.

సతార్ తటాలున తలెత్తాడు.

'త్యాగం – ఎవరిని —?'

సతార్‌కి అంత చీకటిలోనూ సన్నటి వెలుగురేఖ కనిపించింది. అతను తన ఆత్మ రామదాసులో చూసుకున్నాడు. ఈ అంతరాత్మ ఈశ్వరుని చేతిలోని దీపమై ప్రకాశించింది. ఆ కాంతి క్రమంగా అతని జీవితం నిండా వ్యాపించింది. అతని కన్నీటిలో రామదాసు కరిగిపోయాడు.

సతార్ ఉత్తరాన్ని చింపి అగ్నిలో పడేశాడు.

* * *

ఆ తరువాత వారం రోజులకు రామదాసుకు కొడుకు పదిరోజులలో వస్తున్నట్లుగా ఉత్తరం వచ్చింది. ఈ పది రోజులు అతను అన్నం తినలేదు. నిద్ర పోలేదు. ప్రతిక్షణము యుగమై అతన్ని బాధ పెట్టింది. అతని కాలు భూమ్మీద ఆనలేదు. ఈ ఆనందాన్ని చెప్పుకోవాలంటే సతార్ వూళ్ళో లేదు. వ్యాపారం పనిమీద ఏదో వూరు వెళ్ళాడు.

శేషు వచ్చాడు.

"నాన్నా" అన్నాడు ప్రేమగా.

రామదాసు హృదయంలో కోటివీణలు మ్రోగినయి. ఈ నాటిక అతని జీవితానికి అర్థం కనిపించింది. ఆప్యాయంగా కొడుకుని కౌగలించుకుని 'ఈ పాపిష్టితండ్రిని క్షమించు బాబు!" అంటూ ఏడ్చాడు.

"ఊరుకో నాన్నా, నేను వచ్చానుగా."

"ఈ తండ్రిని విడిచి వెళ్ళవుగా! నా కింకెవరున్నారు చెప్పు? నీ కోసరం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూశాను. జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా, నీ కోసరమే బ్రతికాను. ఈ ముసలితండ్రి నీ కేమీ ఇవ్వలేదు. నిన్ను సరిగా చూసుకునే శక్తి కూడా నాలో లేదు. నీ స్పర్శతోనే నిన్ను గుర్తించాలి నాన్నా. ఈ పిచ్చితండ్రి లోకంలో దొంగ, హంతకుడు. కొడుకుని నిర్దాక్షిణ్యంగా గాలికి వదలిన దుర్మార్గుడు."

రామదాసు వెక్కి వెక్కి ఏడ్చాడు.

"నాన్నా" అన్నాడు శేషుఆప్యాయంగా, తండ్రి దేహమంతా నిమురుతూ.

రామదాసు పితృ హృదయం పూర్ణిమి నాటి సముద్రమల్లే ఉప్పొంగిపోయింది. అతని జీవితం ఆశావృక్షమై కాయలు కాసింది. ఆ కాయలు అప్పుడే పండాయి.

కొడుకుని సతార్ కి రాబర్ట్సుకి పరిచయం చేస్తుంటే, రామదాసు అదోవిధమైన గర్వంతో కూడిన అనుభూతితో పులకించిపోయాడు. అయితే ఆ క్షణంలో సతార్ ముఖంలో రాబర్ట్సు ముఖంలో ఎలాటి భావం వ్యక్తమైనదో గ్రహించలేకపోయాడు. సతార్ తనకోసరం కన్నకొడుకునే త్యాగం చేశాడని రామదాసుకి తెలియదు!

నిజానికిది యదార్థానికి చాల దూరంగా వుండచ్చు. చాలమంది దీన్ని నమ్మరు. కాని ఎవరి సానుభూతి నాశించి సతార్ ఈ పని చేయలేదు.

మతానికి, జాతికి, కులానికి, దేశానికి, కాలానికి అతీతమై మనిషికీ మనిషికీ మధ్య అనుబంధ మొకటుంది. అది కేవలం కర్రవంతెనే. అదే మానవత్వం. ధనంతోనూ, కీర్తితోనూ, స్వార్థంతోనూ తృప్తిపొందనివ్యక్తి, ఈ మానవత్వ స్పర్శతో తృప్తిపడగలడు. శాంతి పొందగలడు. మనిషి పైన మనిషి చూపించే ఈ నిస్వార్థ ప్రేమానుబంధమే మనిషికీ ఈశ్వరుడికీ గల సంబంధం. దైవత్వానికి వారసత్వం మానవత్వమే.

మతములు వేరైనా మానవు లొక్కటే! మతము, మనిషికీ ఈశ్వరుడికీ వుండే సంబంధం మాత్రమే. అది మానవుని హృదయంలోని మహత్తర అనుభూతి. ఈ సంబంధం ఏవిధంగానైనా వుండవచ్చు. దానివలన మనిషి నైతిక పరిపూర్ణత పొందుతాడు. కాని సతార్ ఆత్మవంచన చేసుకోలేదు. ఇది కేవలం నటనే కావచ్చు. కాని అందులో మోసం లేదు. ఒక్కొక్కప్పుడు జీవితానికి అబద్ధమే కావలసి వస్తుంది.

సతార్ మహా పండితుడు. సామాన్య మానవుడు. అతని చుట్టూ వున్న ఈ కాస్త పరిధిలోనే అతను ప్రేమించాడు. ఆ ప్రేమ ద్వారా సర్వమానవులలో వెలిగే ఈశ్వరాంశ అయిన ఆత్మను దర్శించాడు. మానవుడైనందుకు మానవత్వాన్ని ప్రదర్శించాడు.




పరిపూర్ణత ఈ మానవత్వంలోనే వున్నది. ప్రేమ, సత్యము, త్యాగము, ధర్మము ఇవన్నీ మానవత్వానికి దోహదం చేస్తాయి; లేదా దాన్ని వెలిబుచ్చే పరికరాలు అవుతాయి. త్యాగమంత సులభం కాదు. ఈ నిష్కామకర్మే మనిషిని అమరత్వానికి తీసుకువెడుతుంది. ఇదే ఆరాధన- భగవంతుని ఆరాధన. ఈ సత్యానికి మించిన సంస్కృతి లేనే లేదు. భగవంతుని పూజించటానికి మానవుని ఆత్మసంపద ప్రేమ త్యాగము. ఈ త్యాగమే జీవితాన్ని పరమాత్మకి అభిముఖంగా త్రిప్పుతుంది.

చాలా రోజుల తరువాత వచ్చావు. ఇంక ఆ ముసలిప్రాణిని వదిలివెళ్ళకు బాబూ," అన్నాడు సతార్,

శేషు తలూపాడు.

సతార్ ఆనందం అనుభవంలోకి వచ్చింది. ఆ ఆనందం మరొకరికి ఆనందాన్నివ్వడంవల్ల వచ్చింది. ఇదే అతని అస్తిత్వానికి పరిపూర్ణత నిచ్చింది.

రామదాసు చేయి పట్టుకుని శేషు తీసుకుపోతుంటే రాబర్ట్సు కళ్లు చెమర్చాయి.

"ఇతను ఏం చేశాడో నీకు తప్ప మరెవరికీ తెలీదు. సతార్ ని ఆశీర్వదించు," అన్నాడు ప్రార్థిస్తూ.

ఈశ్వరుని ప్రేమస్పర్శలా వెన్నెల జగమంతా నిండింది.